సాయిబాబానగర్ నూతన కార్యవర్గం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌కు చెందిన సాయిబాబానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా డి.శ్రీధర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఐ.మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.సంజీవరెడ్డి, శాలివాహన్, ప్రధాన కార్యదర్శిగా పి.సమ్మిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా వరుణ్‌కుమార్, సత్యనారాయణ, కోశాధికారిగా సుభాష్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రణీతరెడ్డి, పద్మారెడ్డి, సలహాదారుగా రవీందర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా సుదర్శన్‌రావు, మల్లేశం, అమరేందర్‌రావు, బాల్‌చారి, మల్లేశం, జిగ్నేష్, నర్సింహారెడ్డి, లత, మాధురి, లతారెడ్డి, అపర్ణ, ప్రేమలతరెడ్డి నియమితులయ్యారు.

ఉదయ సాహితి సంస్థ అధ్యక్షుడిగా తులసి వెంకటరమణాచార్యులు



మల్కాజిగిరి: ఉదయ సాహితి సంస్థ(సాహిత్య వికాస వేదిక) జంట నగరాల శాఖ అధ్యక్షుడిగా మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, అక్షర కౌముది సామాజిక సాహిత్య సేవా సంస్థ నిర్వాహకుడు తులసి రమణాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం లక్ష్మయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. సంస్థ ద్వారా గ్రంథాలయ వారోత్సవాలు, పుస్తక ప్రచురణ, ప్రదర్శన, సాహిత్య పరిచయ వేదికల ద్వారా వర్తమాన రచయితలకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు సరస్వతి మాత పూజ

రామంతాపూర్: చిన్న చెరువు గ్రౌండ్‌లో శ్రీసరస్వతి పూజా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు హోమం, అక్షరభ్యాసం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శ్రీసరస్వతి మాతపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజ అనంతరం అన్న ప్రసాదన కార్యక్రమం ఉంటుందని సమితి ప్రతినిధులు తెలిపారు.

ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలి

మల్లాపూర్: ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారికి జీవనోపాధి కోసం రూ.15 వేలు ఇవ్వాలని దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ఆటో కార్మికుల కుటుంబాలు పోషించలేక ఈఎంఐలు, ఇళ్ల అద్దెలు కట్టలేక పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉచిత విద్య, వైద్యంతో పాటు బీమా రూ.20 లక్షలను ప్రకటించాలన్నారు.

చలో నల్గొండకు బీఆర్ఎస్ నేతలు

ఉప్పల్: చలో నల్గొండ కార్యక్రమానికి ఉప్పల్ నుంచి బీఆర్ఎస్ నేతలు భారీగా తరలివెళ్లారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నేతలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు భారీగా నల్గొండకు తరలివెళ్లారు. హబ్సిగూడ నుంచి బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భారీగా నల్గొండకు తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, శాంతి సాయిజన్ శేఖర్ తదితరులు వెళ్లారు.

ఉచిత కౌన్సెలింగ్ సెషన్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాలంటైన్స్‌డే సందర్భంగా బాగ్‌లింగంపల్లి 'యూ అండ్ మీ సెంటర్'లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సెషన్ నిర్వహిస్తున్నట్టు కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.జీ. వీరేందర్ తెలిపారు. ప్రేమ వివాహాల తర్వాత కలిసి ఉండలేకపోవడం, ప్రేమ సంబంధిత విషయాల్లో ఒత్తిడి, డిప్రెషన్ తదితర సమస్యలపై కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అలాగే రాత్రి 8 గంటల నుంచి 9గంటల వరకు జూమ్ సెషన్ ఉంటుందన్నారు. ఫోన్: 9390771469.

బోడుప్పల్‌లో కలెక్టర్ గౌతమ్ పర్యటన



స్థానిక విషయాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్



వ్యర్థాలతో తయారు చేసిన బ్రికెట్ పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డితో కలిసి లక్ష్మీనగర్‌లో హుడా పార్కును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను, చెత్త డంపింగ్ యార్డు(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు)ను సందర్శించి చెత్త సేకరణ, చెత్తను జవహర్‌నగర్‌కు తరలించేందుకు అనుసరిస్తున్న విధానాన్ని, రా చెరువును సందర్శించి అక్కడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మేనేజర్ నాగేంద్రబాబు, డీఈలు బాలమురళి, శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, ఆర్‌ఐలు సునీత, నాగవల్లి, సర్వేయర్ రూప పాల్గొన్నారు.

వ్యర్థాల శుద్ధీకరణ పార్కును సందర్శించిన కలెక్టర్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమీకృత వ్యర్థ పదార్థాల శుద్ధీకరణ పార్కును మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. నగర పరిధిలో తడి, పొడి, హానికారక చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసి సేకరించడంతో పాటు సేకరించిన చెత్తలో తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువు, పొడిచెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించుకునే విధానాన్ని, హానికారక చెత్తను క్షేత్రస్థాయిలో వేరు చేయడం, వెల్త్‌ఫ్రం వేస్టు, ప్లాస్టిక్ నివారణ, బర్తన్ బ్యాంక్ మొదలైన అంశాల పట్ల నగర ప్రజలకు అవగాహన కల్పించినట్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కలెక్టర్ గౌతమ్‌కు వివరించారు.

రా చెరువు కింద ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్ష కమిటీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ రా చెరువు కింద సర్వే నంబరు–262లో ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు, పాలకవర్గం కాపాడాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అఖిల పక్ష కమిటీ అధ్యక్షులు ఎల్లగోని బాల్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాపోలు శంకరయ్య కోరారు. రా చెరువు కింద ఉన్న ప్రభుత్వ స్థలంపై జిల్లా కలెక్టర్ గౌతమ్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బోడుప్పల్ రా చెరువు కింద ఉన్న సర్వే నంబరు–262లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలానికి బై నంబర్లు వేసి, అధికారులను తప్పుదారి పట్టించారన్నారు. అంతేగాకుండా తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, పాలకవర్గం వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు రా చెరువు కింద ఉన్న ప్రభుత స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు, సదరు స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ కోశాధికారి ఈగ వెంకటేశ్ ముదిరాజ్, సలహాదారులు బద్దుల సత్యనారాయణ యాదవ్, ఏనుగుల లక్ష్మయ్య, ప్రతినిధులు హరినాథ్‌గౌడ్, చీరాల జంగయ్య, రాపోలు రామస్వామి పాల్గొన్నారు.

ధన్‌పాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే పరిస్థితి లేదు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి

కాప్రా: తన ఆస్తులు కాపాడుకునేందుకే ధన్‌పాల్‌రెడ్డి పార్టీలు మారుతుంటారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు ధన్‌పాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రానుండటాన్ని కాప్రా సర్కిల్‌కు చెందిన హస్తం పార్టీ సీనియర్లు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంపై మంగళవారం కొత్త అంజిరెడ్డి నేతృత్వంలో మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న ధన్‌పాల్‌రెడ్డి తన ఆస్తులు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ అధికార పార్టీలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ధన్‌పాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి ఎట్టి పరిస్థితుల్లో ఆహ్వానించే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. మాటి మాటికీ కండువాలు మార్చి పార్టీలు మారే ధన్‌పాల్ రెడ్డి వస్తే కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండకపోగా తిరిగి పార్టీకే నష్టం కలుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాంరెడ్డి, బొజ్జా రాఘవరెడ్డి, పెద్ది శ్రీనివాస్‌గుప్తా, గడ్డం యాదగిరి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాసుల పోశయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహర్షి దయానంద సరస్వతి జయంతి



జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆర్య సమాజ్ నిర్వాహకులు

ఉప్పల్: ఉప్పల్‌లో మహర్షి దయానంద సరస్వతి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆర్యసమాజ్ వ్యవస్థాపకులు ఆచార్య వేద సింధూ ఉప్పల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు పి. మురళీధర్‌రావు, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌లు పాల్గొన్నారు. అంతకుముందు ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐ నుంచి ర్యాలీగా వచ్చి ఉప్పల్ జోషి స్కూల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దయానంద సరస్వతి స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకభూమిక పోషించాడని కొనియాడారు. కార్యక్రమంలో స్వామి యజ్ఞదేవ్, హరిద్వార్, అరుణ్ కుమార్, డా.కమల్ నారాయణ, ధర్మతేజ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆర్యసమాజ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్‌కు సత్కారం



అల్వాల్: అల్వాల్‌కు చెందిన సిండికేట్ రైతుల సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంతరెడ్డి మంగళవారం అల్వాల్ సీఐ రాహుల్‌దేవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసుల్లో ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు పాల్గొంటారని మున్సిపల్ నాయకులు కల్లూరి జయచంద్ర, సీపీఐ మండల కార్యదర్శి రచ్చకిషన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దండు రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ నమ్యానాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులు.. ఆరోగ్య ప్రదాతలు



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తూ..

రామంతాపూర్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య ప్రదాతలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. స్థానిక పద్మశాలి భవనంలో బీజేపీ నేత సుధాకర్ గాంధీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దేశ ప్రథమ మహిళా గవర్నర్ సరోజినీనాయుడు జయంతి, జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య మహిళలకు చీరలు పంపిణీ చేసే కార్యక్రమానికి వారు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో భయంతో అందరం ఇళ్లలో ఉంటే పారిశుద్ధ్య కార్మికులు మాత్రం ధైర్యంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతన హరీష్, బీజేపీ సీనియర్ నేత గడ్డం సాయికిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



హబ్సిగూడలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పరిధిలోని మధురానగర్ నిర్మిస్తున్న రోడ్డు పనులను, శ్రీనివాసపురంలో యూజీడీ పనులను మంగళవారం కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, ఓగిరాల మూర్తి, కాలనీవాసులు పాల్గొన్నారు.

చౌదరిగూడలో కూల్చివేతలు



ఘట్‌కేసర్: చౌదరిగూడలో నాలాపై నిర్మించిన అక్రమ కట్టడాలను ఇరిగేషన్, పంచాయత్‌రాజ్ శాఖ అధికారులు మంగళవారం కూల్చివేయించారు. నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తామని, అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేశ్, ఎంపీఓ నందకిశోర్, పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బాదంతో.. గుండెకు బలాన్నివ్వాలి..

సాక్షి, సిటీబ్యూరో: ప్రేమించే గుండె బలోపేతం కావడానికి పరస్పరం తగిన వాలంటైన్స్ డే బహుమతుల్ని ప్రేమికులు ఇచ్చి పుచ్చుకోవాలని ఫిట్‌నెస్, సెలబ్రిటీ ఇన్‌స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా న్యూట్రిషన్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామిలు ఓ ప్రకటనలో సూచించారు. జింక్, ఫోలేట్, ఐరన్, విటమిన్ ఇ, మెగ్నీషియం ప్రోటీన్‌లతో సహా 15 పోషకాలతో నిండిన బాదం గింజలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయని, అంతేగాకుండా చర్మ ఆరోగ్యాన్ని, అధిక బరువు సమస్య తగ్గించడానికి, రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడతాయన్నారు. ఈ నేపథ్యంలో ఆల్మండ్స్ గిఫ్ట్ ప్యాక్స్‌ను ఈ వాలెంటైన్స్ డే బహుమతుల్లో చేర్చాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గౌతంనగర్: సేవా కార్యక్రమంలో భాగంగా సంఘ సేవకులు, మాజీ సైనికులు పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ రాజాశ్రీనివాస్‌నగర్‌లో మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్లు అందజేస్తూ..

అల్వాల్: ఖైరతాబాద్‌లో నిర్వహించిన 5వ ఓపెన్ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ స్పారింగ్ నాకౌట్ పోటీల్లో రణ్‌వీర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. పోటీల్లో విద్యార్థులు హర్షిత్, యోగిందర్, తరుణ్, యశ్వంత్‌కుమార్, రాజనందీశ్వరి, అశీష్, ఆషిక్, అబ్దుల్ సత్తార్, విఘ్నేష్, వినయ్, పావని, మహేష్‌లు బంగారు పతకాలు సాధించగా విక్రమ్ రాథోడ్, సంకీర్తన్‌లు రజత పతకాలు సాధించారు. కార్యక్రమానికి హాజరైన తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆర్గనైజర్ మస్తాన్, రఘురాంరెడ్డి, అనిష్ సెయాని, ఇస్ఫోనియా తైక్వాండో అకాడమీ కోశాధికారి మొయిన్ తదితరులు విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు.



గాంధీపార్కును అభివృద్ధి చేస్తాం



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని గాంధీ పార్కును అభివృద్ధి చేస్తామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం పార్కులో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించే పనులను దాంతో పాటు ప్రహరీ గోడల పైనుంచి లోనికి రాకుండా మెష్ ఏర్పాటు పర్యవేక్షించారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ అధికారులకు పార్కులో గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అదే ప్రాంతంలో ఉన్న వెటర్నరీ ఆస్పత్రికి నీటి సరఫరాకు అవసరయ్యే వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ప్రజల్లో ఆదరణ ఉన్న నేత ఈటల రాజేందర్



మాట్లాడుతున్న వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు ఎల్వీ చిన్నారావు

గౌతంనగర్: బీజేపీ నుంచి మల్కాజిగిరి పార్లమెంట్ సీటును ఈటల రాజేందర్‌కు కేటాయించాలని జాతీయ వాయిద్య కళాకారుల సంఘం నేతలు అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ న్యూమిర్జాలగూడలో జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షులు ఎల్వీ చిన్నారావు మాట్లాడుతూ.. మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ సీటును బీజేపీ అధిష్టానం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు హుస్సేన్, శంకర్, రాష్ట్ర అధ్యక్షులు వేముల శ్రీనివాస్, కార్యదర్శి నాగేష్, కళాకారులు రాజేష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవసేవే.. మాధవసేవ గ్రూప్ సభ్యులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన నర్సింహ సోమవారం అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మానవసేవే మాధవ సేవ గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు గ్రూప్ సభ్యుల సహకారంతో కలిసి నర్సింహ దహనసంస్కారాల కోసం అతడి కుటుంబసభ్యులకు రూ.26 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు, సభ్యులు ఉదారి సత్యనారాయణయాదవ్, వెంకటరమణ, నరేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ఉప్పల్: భార్యాభర్తల మధ్య కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా ప్రాంతానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సునీత(30)లకు 2016లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి రామంతాపూర్ కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటూ కూలి చేసుకుని బతుకుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతోంది. గొడవలు మరింత ఎక్కువ కావడంతో సునీత ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రజల హక్కులను కాపాడిన ఘనత కేసీఆర్‌దే..



మల్కాజిగిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ఛలో నల్గొండ సభకు మల్కాజిగిరి నుంచి భారీ ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మల్కాజిగిరి చౌరస్తాలో ర్యాలీని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ దగాకు గురైందంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులను కాపాడిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ర్యాలీగా తరలివెళ్లిన వారిలో జేఏసీ వెంకన్న, జగదీష్‌గౌడ్, మురుగేష్, వీరేశంయాదవ్ తదితరులు ఉన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా రమేష్‌గుప్తా

మేడ్చల్: మేడ్చల్ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్‌గుప్తా నియమితులయ్యారు. క్లబ్ జిల్లా గవర్నర్ నర్సింలు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యదర్శులుగా గోలీ లక్ష్మణ్, తాళ్లపల్లి నగేష్ నియమితులయ్యారు. క్లబ్ ద్వారా పైద్యులు, ఇతరులకు మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని శివారెడ్డిగూడ కొంతం అంజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యుడు కె.సురేందర్‌రెడ్డి హాజరై నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటే అనే నినాదంతో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామలింగారెడ్డి, జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, కష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

అబ్దుల్ రెహాన్‌ను అభినందించిన డీఈఓ



సాక్షి, మేడ్చల్ జిల్లా: సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు(స్థానం) పొందిన అబ్దుల్ రెహాన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి అభినందించారు. డీఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ర్యాంకు సాధించేందుకు తోడ్పాటు అందించిన వారి గైడ్ టీచర్ అరుణ్ జ్యోతిని కూడా ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ అధ్యక్షుడు మదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.శీనయ్య, ప్రమీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని డీఈఓ విజయకుమారి శాలువాతో సన్మానించారు.